# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-04-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా మరికాసేపట్లో పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించామని మంత్రి ఎస్. సవిత తెలిపారు.

===================

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో బిల్లును ఈ ఉదయం ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సుమారు 2 గంటల పాటు చర్చ జరిగింది. తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు పార్టీల సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం మూజువాణి ఓటుతో ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపిందని స్పీకర్ ప్రకటించారు. ఈ బిల్లు రేపు రాజ్యసభ ముందుకు రానుంది. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు రాష్ట్ర ప్రజల తరఫున సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు.

===================

లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై చేపట్టిన చర్చలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం వికేంద్రీకరణ పేరిట రాజధాని నిర్మాణాన్ని విస్మరించిందన్నారు. దీంతో అమరావతి కోసం భూములు త్యాగం చేసిన రైతులు ఉద్యమించాల్సివచ్చిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని.. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలు ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధిలో అమరావతి కీలకంగా మారాలన్నారు. రాజధానిగా అమరావతికి భారతీయ జనతా పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కేంద్ర గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

ఇక రాజమహేంద్రవరం ఎంపీ డి.పురందేశ్వరి మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ప్రక్రియ అసమంజసంగా జరిగిందని, ఆనాడు చర్చ లేకుండానే రాష్ట్ర విభజన చేశారని ప్రస్తావించారు. అయినప్పటికీ చట్టాన్ని గౌరవించి విభజనను ప్రజలు అంగీకరించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని ఆమె ఉద్ఘాటించారు. చర్చలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ... రాజధాని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని చెప్పారు. అమరావతి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలు కాపాడాలన్నారు. ప్రస్తుత ఫార్మాట్‌లో ఉన్న ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాం కానీ.. అమరావతికి, ఏ ప్రాంతానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

===================

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు కళ్యాణ మహోత్సవం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒంటిమిట్ట చేరుకున్నారు. రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీటీడీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి హెలిపాడ్ వద్ద స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి అక్కడి నుండి టిటిడి అతిథి గృహానికి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి మరికాసేపట్లో సతీసమేతంగా కోదండరామస్వామి వారి ఆలయాన్ని చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

విరామం

===================

రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు 50 ఏళ్లకే 4 వేల రూపాయల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. అదే విధంగా చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఉచిత విద్యుత్ పథకం కోసం సంవత్సరానికి 150 కోట్ల రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని.. అయినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 93 వేల చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, 11 వేల 488 మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఈరోజు నుంచి అమల్లోకి వచ్చింది.

===================

అమరావతి ఆచరణ సాధ్యం కాదని రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత ఉండకూడదనే ఉద్దేశంతోనే గతంలో తాము మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి మెట్రో నగరాలతో పోటీపడాలంటే ఆంధ్రప్రదేశ్ కి కూడా ఆదాయం సమకూర్చే నగరం ఉండాలని, అందుకే విశాఖపట్టణాన్ని కార్యనిర్వాహక రాజధానిగా పెట్టాలనుకున్నామన్నారు. కేవలం 10 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే విశాఖనగరం ఈరోజు ఉన్న ఈ స్థాయి నుంచి

గొప్పస్థాయికి ఎదుగుతుందని చెప్పామన్నారు. ఇందులో స్వార్థం లేదని, ఆచరణాత్మక ధోరణే ఉందన్నారు. శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తూ.. కర్నూలును న్యాయ రాజధానిగా పెట్టాలనుకున్నామని, అమరావతిని శాసన రాజధానిగా కొనసాగించాలని నిర్ణయించామని చెప్పారు. కానీ, ఆ ప్రణాళిక ముందుకు సాగలేదన్నారు. మా ఆలోచనల్లో ఎక్కడా కూడా అమరావతిని నిర్లక్ష్యం చేయలేదని.. రైతులకు ఐదేళ్ల పాటు కౌలును పెంచామని రాజధానిలో పింఛన్లను సైతం 5 వేల రూపాయలకు పెంచామని గుర్తు చేశారు.

===================

చేనేత రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భగ్గేశ్వరంలో మంత్రి ఈరోజు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించే ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని 786 చేనేత కుటుంబాలకు లాభం చేకూరుతుందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

===================

భారతీయ రైల్వేలో అత్యధిక ఆదాయం ఆర్జించిన 5వ డివిజన్‌గా వాల్తేర్ నిలిచిందని డీఆర్ఎం లలిత్ బోహ్రా తెలిపారు. అత్యధిక లోడింగ్ సాధించిన 5వ డివిజన్ గా కూడా రికార్డ్ నెలకొల్పిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాల్తేర్ డివిజన్ సాధించిన విజయాలను ఈరోజు ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. వాల్తేర్ డివిజన్ సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకల్లో రికార్డులు నమోదు చేసిందని చెప్పారు. నిర్దేశించిన లోడింగ్ లక్ష్యాలను అధిగమిస్తూ.. గత ఆర్థిక సంవత్సరంలో మొదటిసారిగా 85.1 మిలియన్ టన్నుల లోడింగ్ సాధించిందన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ కలిపి మొత్తం 150 మిలియన్ టన్నుల మార్క్ దాటిందని చెప్పారు. అదే విధంగా ప్రయాణికుల సంఖ్య 33.42 మిలియన్లకు పెరిగిందని.. తద్వారా 881.37 కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించిందని డీఆర్ఎం లలిత్ బోహ్రా వివరించారు.

===================

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో “వికసిత్ భారత్ యువ కనెక్ట్ ప్రోగ్రామ్ (వి.బి.వై.సి.పి)-2026” కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, జాతీయాభివృద్ధి పట్ల బాధ్యతాభావం పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

===================
===================